క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే సంక్షేమం: కాటా


పార్టీలో చేరిన నాయకులతో కాటా

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇమ్రాన్, ప్రవీణ్, సోహైల్, తిరుపతి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రశేఖర్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ముంగి ఎస్‌ఎల్‌ఆర్ పంక్షన్‌లో నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ చీఫ్ కో–ఆర్డినేటర్ ఎ.చంద్రశేఖర్ సమక్షంలో బీఆర్‌ఎస్ నాయకుడు సయ్యద్ షకీల్‌తో పాటు మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శుక్లవర్ధన్‌రెడ్డి, తిరపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్గిలో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం


మల్గిలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆ గ్రామ సర్పంచ్ మారుతి యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీపతి, సిద్దారెడ్డి, విఠల్, బాలాజీ, ఏక్‌నాథ్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ


ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దేవగిరి మహారాజ్

న్యాల్‌కల్ (జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామ శివారులో గల శ్రీఆదిలక్ష్మి ఆశ్రమం ఆవరణలో ఆసుపత్రి నిర్మాణానికి మంగళవారం ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్ భూమి పూజ నిర్వహించారు. ఆశ్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోలియో దినోత్సవం


రేఖను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సంగారెడ్డి: అంతర్జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని మంజీరా రోటరీ క్లబ్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం రేఖను సత్కరించింది. కార్యక్రమంలో సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ రాజుగౌడ్, క్లబ్ సభ్యులు లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

దసరా సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లాలో ఉన్న ప్రజలు ఉదయాన్నే లేచి తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. మహిళలు తెల్లవారు జాము నుంచే ఆలయానికి చేరుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అధికార, ప్రతిపక్ష, ప్రజాసంఘాల నేతలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల రావణాసురుడి బొమ్మలను దహనం చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా నిర్వహించే ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని అమ్మవారిని ప్రార్థించారు.


ఖేడ్: దహనమవుతున్న రావణుడి కటౌట్



రామచంద్రాపురం: దసరా సంబురాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు


హత్నూర (సంగారెడ్డి)లో..


పటాన్‌చెరు టౌన్: శమీ పూజలో ఎమ్మెల్యే, కార్పొరేటర్, పట్టణ ప్రముఖులు


పటాన్‌చెరు: జమ్మి పూజలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి


నారాయణఖేడ్: శమీపూజలో మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు


జోగిపేట (అందోల్) : మంత్రికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్


జహీరాబాద్: దసరా ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు


పటాన్‌చెరు టౌన్: పూజలో నీలం మధును సన్మానిస్తున్న నిర్వాహకులు


న్యాల్‌కల్(జహీరాబాద్): అమ్మవారి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు


మునిపల్లి(అందోల్): తల్లి పాదాలకు నమస్కరిస్తున్న జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్


సంగారెడ్డి: బ్యాతోల్‌లో జెడ్పీటీసీ కొండల్ రెడ్డి


కల్హేర్: బల్కంచెల్క తండా.. రవాణ శాఖ అధికారి మూడ్ కిషన్ సింగ్ తదితరులు


జిన్నారం: గుమ్మడిదలలో నిర్వహించిన ఉత్సవాల్లో నాయకులు, ప్రజలు

టీ-హబ్ ను సందర్శించిన గీతం విద్యార్థులు


టీ హబ్‌లో గీతం విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలోని బీఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థులు మంగళవారం హైదరాబాద్‌లోని టీ-హబ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఫార్మసీ స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హైమ పర్యటనను సమన్వయం చేయగా, డాక్టర్ పవన్ కుమార్ సహకరించారు. ఈ సందర్భంగా గీతం ఫార్మసీ విద్యార్థులు టీ-హబ్‌లో పరిశ్రమ నిపుణులతో ముఖాముఖి సమావేశాలను నిర్వహించారు. టీ-హబ్ ఈవెంట్స్ టీమ్ కె.వినయ్, సౌకర్యాల ఉపాధ్యక్షుడు మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాసు ఆ సంస్థ స్థాపనతో పాటు దాని కార్యకలాపాల గురించి వివరించారు. టీ-హబ్ స్థాపనలో ఐటీశాఖ మంత్రి కేటీరామారావు ముందుచూపు, క్రియాశీల పాత్రను వారు తెలియజేశారు. ఈ సందర్శనలో టీ-హబ్ సౌకర్యాలు, పని ప్రదేశాలను చూడటమే గాక, స్టార్టప్లు, యువ పారిశ్రామికవేత్తల అంకితభావం, ఆవిష్కరణలను నేరుగా చూడటం వల్ల గీతం విద్యార్థులలో వ్యవస్థాపకత, ఆవిష్కరణల పట్ల మక్కువను మరింత పెంచింది.ఈ పర్యటనను విజయవంతం చేయడానికి సహకరించిన టీ-హబ్ సీఈవో శ్రీనివాసరావు మహంకాళికి డాక్టర్ హైమ కృతజ్ఞతలు తెలియజేశారు.

సమాజ సేవ కోసమే దేవాలయాలు, ఆశ్రమాలు

బర్దిపూర్ పీఠాధిపతి శ్రీ అవదూత దత్తగిరి మహరాజ్

మునిపల్లి(అందోల్): సమాజ సేవ కోసమే ఆశ్రమాలు, దేవాలయాలు గ్రామాల్లో ఉండాలని బర్దిపూర్ దత్తగిరి శ్రీ ఆశ్రమ పీఠాధిపతి అవదూత గిరి మహరాజ్ భక్తులకు ఉపదేశించారు. సోమవారం మండలంలోని పెద్దలోడి గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో దత్తాత్రేయ దేవాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దత్తాగిరి మహరాజ్ మట్లాడుతూ.. పెద్దలోడి గ్రామంలో దత్తాత్రేయ దేవాలయం వాస్తుకు లేకపోవడంతో పునః నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. ప్రతీ గ్రామంలో గురు ఆశ్రమాలుంటే మనకేలాంటి కష్టం రాదాన్నారు. బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో కులమతాలకతీతంగా పిల్లలకు వేదాలు నేర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బస్వరాజ్ పటేల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, అశోక్, బస్వరాజ్, నాగరాజు పాటిల్, శేఖర్, వీరన్న, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న దత్తగిరి మహరాజ్

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): నవరాత్రోత్సవాల్లో భాగంగా చివరి రోజు కావడంతో దుర్గమ్మ అమ్మవారికి జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో దుర్గమ్మకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, మొగులయ్య, నర్సింలు, జగదీశ్వర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

ఇస్నాపూర్ చౌరస్తా వద్ద ఘటన

పటాన్‌చెరు టౌన్: బైక్ అదుపు తప్పి కింద పడిన వ్యక్తి మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ అశోక్ కథనం ప్రకారం... పాశమైలారం గ్రామస్తుడు ఎండీ దస్తగిరి ఒక ప్రైవేటు ఉద్యోగి. తన వ్యక్తిగత పని నిమిత్తం సోమవారం ఉదయం మండలంలో ఉన్న ఇస్నాపూర్ చౌరస్తా వద్దకు రాగా బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. వెంటనే స్థానికుల సహాయంతో క్షతగాత్రుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం హైదరాబాద్‌లో ఉన్న గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతను అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి బావ రియాకత్ పాషా ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మన్యానాయక్ తండాలో భోగ్‌బండార్


భోగ్‌బండార్‌లో నాయకులు

నారాయణఖేడ్: మండలంలోని మన్యానాయక్ తండాలో మంగళవారం తండావాసులు, భవానీమాత దీక్షాదారుల ఆధ్వర్యంలో బోగ్‌బండార్, యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్, పీసీసీ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బహుజన్ ముక్తిమోర్చా ఖేడ్ అసెంబ్లీ అభ్యర్థి ప్రకాశ్ రాథోడ్ పాల్గొన్నారు.

పాదయాత్రికులకు అన్నదానం

జహీరాబాద్ టౌన్: మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్ భవానీ మాత దర్శించుకునేందుకు పాదయాత్రగా వెళుతున్న భక్తులకు పలు సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ నియోజకవర్గం నుంచి భక్తులు పాదయాత్ర ప్రారంభించారు. జాతీయ రహదారి పొడవునా పలు చోట్ల పలు సంఘాల సభ్యులు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భోజన సదుపాయం కల్పించారు.

భార్యతో గొడవల కారణంగా..

జిన్నారం(పటాన్‌చెరు): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి రాలేదు. ఈ ఘటన మండలంలో ఉన్న కిష్టాయిపల్లిలో సోమవారం జరిగింది. సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన నర్సింలు ఓ పరిశ్రమలో కార్మికుడు. కొంత కాలంగా భార్యతో గొడవలు జరుగుతుండటంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతు

జిన్నారం(పటాన్‌చెరు): చెరువులో స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగింది. ఏపీలో ఉన్న మాచవరానికి చెందిన వెంగళరావు(35) అల్లీనగర్‌లో మేస్త్రీ. దసరా వేడుకల సందర్భంగా తోటి స్నేహితులతో కలిసి అతడు మద్యం తాగాడు. బామన్‌చెరులో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. స్థానికులు ఎంత వెతికినా ఆచూకీ తెలియరాలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

చెడుపై మంచిని సాధించిన రోజు

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్


మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: చెడుపై మంచి విజయాన్ని సాధించిన రోజుని విజయదశమిగా జరుపుకుంటామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. సోమవారం దసరాను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని చర్చి పక్కన ఉన్న క్రీడా మైదానంలో టీం గడీల సభ్యులు రావణ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాంత్ గౌడ్ హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

పూజలు చేసిన డీఎస్పీ పురుషోత్తం రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దసరా పండగను పురస్కరించుకొని సోమవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, పటాన్‌చెరు సీఐ లాలూ నాయక్, క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ నాగలక్ష్మి, నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆయుధాల సామగ్రికి, పోలీస్ వాహనాలకు వేద పండితుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.


పూజ చేస్తున్న డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ లాలూనాయక్

ముగిసిన దుర్గాదేవి ఉత్సవాలు

ఝరాసంగం(జహీరాబాద్): విజయదశమి పండుగను పురస్కరించుకొని కేతకీ సంగమేశ్వర ఆలయంలో నిర్వహించిన దుర్గాదేవి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం ముగింపు సందర్భంగా అమ్మవారికి పూర్ణాహుతి, హోమం, యజ్ఞం, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం దుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.


దుర్గాదేవి ఉత్సవాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

గుంతను తప్పించబోయి..

చెట్టును ఢీ కొట్టిన కారు, ఒకరి మృతి


యాదగిరి

పటాన్‌చెరు టౌన్: రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయిన కారు.. చెట్టును ఢీ కొనగా వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ ఆందయ్య కథనం ప్రకారం మండలంలోని చిన్న కంజర్ల గ్రామస్తుడు తొంటోల్ల యాదగిరి(38) సోమవారం సాయంత్రం బంధువుల కారు తీసుకుని పటాన్‌చెరుకు బయలుదేరాడు. పెద్దకంజర్ల గ్రామ శివారులోకి రాగా గుంతను తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడ మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న మంగళవారం ఫిర్యాదు చేయగా కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నేత ఆత్మహత్యాయత్నం

హత్నూర(సంగారెడ్డి): బీజేపీ నేత బెదిరించారని అదే పార్టీకి చెందిన మరో నాయకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలో ఉన్న బ్రాహ్మణగూడలో జరిగింది. వివరాలిలా.. గ్రామానికి చెందిన బొట్ల శేషాద్రి కొన్నేళ్లుగా పార్టీలో నాయకుడిగా ఉన్నాడు. ఇటీవల అధిష్టానం నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మురళీయాదవ్‌ను ప్రకటించింది. తన అభిమాన నాయకులకు ఎమ్మెల్యే టికెట్ దక్కలేదని బీజేపీ నాయకుడి పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో అతను ఈనెల 22న ఓ పోస్టు పెట్టాడు. ఎందుకు పోస్ట్ చేశావని మురళీయాదవ్ ప్రధాన అనుచరుడు, దౌలాపూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్ల సతీష్ యాదవ్ అసభ్య పదజాలంతో తిట్టి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించాడు. దీంతో సతీష్‌పై చర్యలు తీసుకోవాలని 23న హత్నూర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. కాగా మంగళవారం ఉదయం పురుగుల మందు తాగుతున్న సెల్ఫీ వీడియో గ్రూపులో శేషాద్రి పోస్ట్ చేశాడు. కాగా వెంటనే కుటుంబీకులు విషయం తెలుసుకొని అతడిని స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.